క్లుప్తంగా...

కళాసిల్క్ ఎగ్జిబిషన్‌కు అనూహ్య స్పందన



కళాసిల్క్ హ్యాండ్‌లూమ్ ఇండియా ఎగ్జిబిషన్‌లో వినియోగదారుల సందడి

మణికొండ: మణికొండ ఓపెన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కళాసిల్క్ హ్యాండ్‌లూమ్ ఇండియా ఎగ్జిబిషన్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. వేసవిని పురస్కరించుకుని చేనేత కళాకారులతో ప్రత్యేకంగా రూపొందించి కాటన్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, గృహోపకరణాలతో కూడిన పలు వస్తువులను ప్రదర్శనలో ఉంచారు. భారత దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని ప్రఖ్యాతి గాంచిన చేనేత వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు వినోద్ కోరారు.

మణికొండ మున్సిపల్ మేనేజర్‌గా రమేష్



మణికొండ కమిషనర్‌తో నూతన మేనేజర్ రమేష్

మణికొండ: మణికొండ మున్సిపల్ మేనేజర్‌గా బీఎన్‌కే రమేష్ నియమితులయ్యారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మున్సిపాలిటీలో పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. సోమవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్‌ను కలిసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

బ్రాహ్మణ సదన్‌ను సందర్శించిన అధికారులు

- ఈనెల 31న ప్రారంభించనున్న సీఎం



బ్రాహ్మణ సదన్ భవనాన్ని పరిశీలిస్తున్న రమణాచారి, ఇతర అధికారులు

రాయదుర్గం: శేరిలింగంపల్లిలోని గోపన్‌పల్లి పరిధిలో నిర్మిస్తున్న బ్రాహ్మణ సదన్‌ను అధికారులు సోమవారం సందర్శించారు. ఈనెల 31వ తేదీ సీఎం చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా ప్రారంభించనున్న బ్రాహ్మణ సదన్‌ను ప్రభుత్వ సలహాదారు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ రమణాచారి, ఇతర ఉన్నతాధికారులు, జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శంకరయ్య, శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ వెంకన్న, ఇతర జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు.

ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లోని శ్రీ అభయ వీరాంజనేయ స్వామి ఆలయ ద్వాదశ వార్షిక బ్రహ్మోత్సవాలలో ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం నిర్వహించిన ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, బ్రిక్ శ్రీను, గుమ్మడి శ్రీనివాస్, సంజీవరెడ్డి, శివాజీ, ప్రభాకర్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

దంపతులపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

- భర్త మృతి, భార్యకు స్వల్ప గాయాలు
- జూకల్‌లో మ్యాంగోఫామ్‌లో దారుణం

శంషాబాద్: మామిడి తోటలో పనిచేస్తున్న దంపతులపై అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటనలో భర్త మృతి చెందగా భార్యకు స్వల్పగాయాలయ్యాయి. శంషాబాద్ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. జూకల్‌లోని మ్యాంగోఫామ్‌లో వెంకటరాజు (60) నాగమణి దంపతులు కొంతకాలంగా పనిచేస్తూ అందులోనే నివాసం ఉంటున్నారు. సోమవారం ఉదయం పక్కనే ఉన్న తోటకు చెందిన వ్యక్తులు రక్తపు మడుగులో పడి ఉన్న వెంకటరాజు, స్పృహలేకుండా ఉన్న నాగమణిని చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వెంకటరాజు మృతి చెందినట్లు గుర్తించారు ..అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తన భర్తపై ఆయుధాలతో దాడి చేయడంతో పాటు తనపై స్ప్రే కొట్టడంతో స్పృహ కోల్పోయినట్లు అతడి భార్య వెల్లడించింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. హైదర్షాకోటలో ఉంటున్న వెంకటరాజు కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తుకు పునాది



సీఎంకప్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు



పోటీలను ప్రారంభిస్తున్న మేయర్, చైర్ పర్సన్ తదితరులు

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: క్రీడలు యువత ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేస్తాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని పెద్దతూప్ర గ్రామంలో సోమవారం సీఎం కప్ క్రీడా పోటీల ప్రారంభానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తుందన్నారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో సీఎం కప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి శ్రీకారం

పెద్దతూప్ర గ్రామంలో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. గ్రామాల అభివృద్ధికి దశలవారీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పెద్దతూప్ర గ్రామసర్పంచ్ చిటికెల వెంకటయ్య, ఎంపీపీ జయమ్మ జెడ్పీటీసీ నీరటి తన్వీరాజు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కె. చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రీడల్లో పాల్గొన్న యువతులు

ఘనంగా చీఫ్ మినిస్టర్ కప్ 2023

బండ్లగూడ: గండిపేట మండలస్థాయి సీఎం కప్ 2023 టోర్నమెంట్ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బైరాగిగూడలోని బీఎంఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో ఘనంగా ప్రారంభమైంది. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్, నార్సింగి, మణికొండ మున్సిపాటీలకు చెందిన పలువురు యువతీ, యువకులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన బండ్లగూడ జాగీర్ మేయర్ మహేందర్‌గౌడ్, నార్సింగి చైర్ పర్సన్ రేఖ యాదగిరి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వాలీబాల్, ఖోఖో, కబడి, రన్నింగ్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తుందన్నారు. యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికి తీసి వారిని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా పోత్సహిస్తుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి కమిషనర్లు వేణుగోపాల్‌రెడ్డి, సత్యబాబు, పాల్గున్ కుమార్ తహసీల్దార్ రాజశేఖర్, ఎంఈఓ రాంరెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్, కార్పొరేటర్లు తలారి చంద్రశేఖర్, అస్లాంబిన్ అబ్దుల్లా, కౌన్సిలర్‌లు రామకృష్ణారెడ్డి, పత్తి ప్రవీణ్ నాయకులు నాగరాజు, పాపయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన గండిపేట మండల స్థాయి చీఫ్ మినిస్టర్ కప్ 2023 లో భాగంగా నిర్వహించిన మహిళల ఖోఖో పోటీల్లో నార్సింగి మున్సిపాలిటీ జట్టు మొదటి బహుమతి సాధించగా, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ రెండో స్థానంలో నిలిచింది. కబడ్డీలో నార్సింగి మున్సిపాలిటీ మొదటి బహుమతి సాధించగా, బండ్లగూడ జాగీర్‌కు రెండో బహుమతి వచ్చింది. 100 మీటర్ల రన్నింగ్ పోటీలో బండ్లగూడ జాగీర్‌కు చెందిన జీ.శివానికి మొదటి బహుమతి, పి. శివాని రెండో బహుమతి సాధించారు. పురుషుల ఖోఖో, కబడ్డీ పోటీల్లో నార్సింగి మొదటి స్థానం, మణికొండ రెండవ స్థానంలో నిలిచాయి. వాలీబాల్‌లో పోటీల్లో బండ్లగూడ జాగీర్‌కు మొదటి స్థానంలో నిలువగా మణికొండ రెండవ స్థానంలో నిలిచింది. పురుషుల అథ్లెటిక్ 100 మీటర్ల పరుగులో మణికొండకు చెందిన జహీర్ ఖాన్ మొదటి బహుమతి, చంద్రశేఖర్ ద్వితీయ బహుమతి సాధించారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మేయర్

కార్మిక హక్కుల సాధనే ధ్యేయం



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు వెంకటయ్య

రాజేంద్రనగర్: కార్మిక హక్కుల సాధనకు సీఐటీయూ నిరంతర పోరాటాలు చేస్తుందని రాజేంద్రనగర్ మండల సీఐటీయూ నాయకుడు వెంకటయ్య అన్నారు. శాస్త్రిపురం వట్టిపల్లి లేబర్ అడ్డా నూతన కమిటీ ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజేంద్రనగర్ మండల సీఐటీయూ కన్వీనర్ రుద్ర కుమార్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని అన్ని అడ్డాల్లో కమిటీలు వేస్తున్నట్లు తెలిపారు. కార్మికుల హక్కుల సాధనకు సీఐటీయూ ముందుండి పోరాడుతుందని ఎలాంటి ఇబ్బందులున్నా... తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్మికులకు ఇన్సూరెన్స్ తదితర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నూతన కార్యవర్గం..

వట్టిపల్లి లేబర్ అడ్డా నూతన కమిటీ అధ్యక్షులుగా రహీం, కార్యదర్శిగా చాంద్ పాషా, సహాయ కార్యదర్శిగా అక్రం, కోశాధికారిగా సమి, సహాయ కార్యదర్శిగా షమీమ్ బాబు, ఉపాధ్యక్షులుగా బాబురావు, కార్య నిర్వాహకులుగా ఇస్మాయిల్, రాజు, లక్ష్మీ, కిశోర్ ఎన్నికయ్యారు.

వైభవంగా పోచమ్మ దేవాలయ వార్షికోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని పోచమ్మ దేవాలయం పదో వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకంతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం పల్లకి సేవ కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు వనం శ్రీరాం రెడ్డి, రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి మ్యాడం రామేశ్వర్ రావు, సురేందర్ రెడ్డి, చిన్న, శ్రీధర్ రెడ్డి, కొమరయ్య, మధుసూదన్, సామా ఇంద్రపాల్ రెడ్డి, సులిగే విజయ్, మల్లా రెడ్డి, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారం

రాయదుర్గం: కేశవనగర్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను సోమవారం జలమండలి అధికారులు పరిష్కరించారు. గత మూడు రోజులుగా గచ్చిబౌలి డివిజన్ కేశవనగర్‌లో మురుగు కాలువలన్నీ వ్యర్థాలు, చెత్తాచెదారంతో నిండిపోయి మురుగునీరు సమీపంలోని ఇళ్లలోకి పారడంతో బస్తీవాసులు నానా ఇబ్బందులు పడ్డారు. దుర్వాసనతోపాటు ఇంట్లోకి మురుగు రావడంతో భరించలేక పోయారు. ఈ నేపథ్యంలో స్థానిక నాయకులు తిరుపతి, శ్రీనివాస్, ఈశ్వర్, రాజు, సాయిలు గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన అధికారులకు సమాచారం ఇవ్వడంతో అధికారులు, సిబ్బంది బస్తీకి చేరుకొని డ్రైనేజీ కాలువలను, మ్యాన్‌హోల్స్ ను శుభ్రం చేయించారు.

చదువుతోపాటు మిగతా రంగాలలోనూ రాణించాలి



క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న వీసీ సయ్యద్ ఐనుల్ హసన్

రాయదుర్గం: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించేలా ప్రయత్నించాలని మనూ వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ సూచించారు. సోమవారం యూజీసీ ద్వారా జీ-20 యూనివర్సిటీ కనెక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా వారం రోజుల పాటు నిర్వహించే అంతర్ హాస్టల్స్ విద్యార్థుల క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కాగా బాలురకు 3కె రన్, బాలికలకు 2కె రన్ పోటీలను వీసీ జెండా ఊపి ప్రారంభించారు. బాలుర 3కె రన్ విజేతలుగా షాబాద్ మంజూర్, బాలిక రన్ విజేతగా సైమాపర్వీన్ నిలిచారు. వారిని వీసీ, ఇతర ప్రొఫెసర్లు అభినందించారు. కాగా ఈనెల 21వ తేదీ వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రికెట్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, చెస్, ఉపన్యాసం, వ్యాస రచన, క్విజ్, బైట్‌బాజీ, గానం, మిమిక్రీ, మైమ్ వంటి పోటీలను నిర్వహిస్తారు.

అక్రమ పార్కింగ్‌తో అవస్థలు

గోల్కొండ: అక్రమ పార్కింగ్‌లకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. షాపింగ్ మాల్స్, రెస్టారెంట్ల ముందు రోడ్ల పైనే కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. షేక్‌పేట్ డి-మార్ట్ ఎదురుగా ఉన్న రోడ్డు పై వాహనాలు అడ్డదిడ్డంగా పార్క్ చేసి ఉంటున్నాయి. కొత్తగా వేసిన డివైడర్ పై కూడా దర్జాగా వాహనాలు పార్క్ చేస్తున్నారు. టోలిచౌకీ అర్బా హోటల్, టూంబ్స్ చౌరాస్తా సమీపంలోని జీషాన్ హోటల్ ఎదుట పెద్ద సంఖ్యలో వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. పశ్చిమ మండలం ఆర్టీఏ కార్యాలయంలో సమీపంలోని షాగౌస్ హోటల్ ముందు సైతం రోడ్లపై కార్లు, ద్విచక్ర వాహనాల నిలపడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పోలీసు అధికారులు జోక్యం చేసుకుని అక్రమ పార్కింగ్‌లకు అడ్డుకట్ట వేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



షేక్‌పేట్ డీ-మార్ట్ ఎదుట రోడ్డుపై అక్రమ పార్కింగ్

ప్రతిభావంతులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న 'సెట్విన్' ఎండీ కె.వేణుగోపాల్ రావు

యాకుత్‌పురా: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని సెట్విన్ శిక్షణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల్ రావు అన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియేట్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన సెట్విన్ ఉద్యోగుల పిల్లలను సోమవారం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రతీక్ కుమార్, గణేష్ కుమార్, సౌమ్య, మహెర జబీన్, వెంకట రామన్, నహీద్ ఫాతిమా, టి.భానుప్రకాశ్‌లను సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం వేణుగోపాల్ రావు మాట్లాడుతూ... ప్రతిభావంతులను సత్కరిస్తే వారికి మరింత ప్రోత్సాహం అందించినట్లవుతుందని అన్నారు. ఇంటర్ విద్యార్థిని సౌమ్య ఉన్నత విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చును తానే భరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెట్విన్ అకౌంట్స్ ఆఫీసర్ ఓంప్రకాశ్, మేనేజర్ ఎం.ఎ.మోహిజ్, టీ స్టెప్ మేనేజర్ జె.జగన్నాథం, సెట్విన్ సూపరింటెండెంట్ పీబీఎస్ ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఠాణాల్లో అత్యాధునిక సౌకర్యాలు



హుమాయున్‌నగర్ ఠాణాను ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రులు మహమూద్ అలీ, తలసాని తదితరులు

గోల్కొండ: నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్లలో అత్యాధునిక సౌకర్యాలు కల్పించినట్లు రాష్ట్ర హోం మంత్రి మహ్మద్ మహమూద్ అలీ అన్నారు. సోమవారం ఆయన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి హుమాయున్ నగర్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్‌లకు కొత్త భవనాలు నిర్మిస్తున్నామన్నారు. త్వరలోనే అన్ని పోలీస్ స్టేషన్లకు నూతన భవనాలు అందుబాటులోకి వస్తాయన్నారు. తెలంగాణ పోలీసుల పనితీరు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉందన్నారు. నేరస్తులు ఎంతటి వారైనా సరే పోలీసుల నుంచి తప్పించుకోలేరన్నారు. ఫిర్యాదుల కోసం ఠాణాకు వచ్చే వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని, బాధితులకు సత్వర న్యాయం అందించడమే తమ లక్ష్యమన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం ప్రవేశపెట్టిన ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. సైబర్ నేరగాళ్ల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కార్వాన్, నాంపల్లి ఎమ్మెల్యేలు కౌసర్ మొహియుద్దీన్, జాఫర్ హుసేన్ మేరాజ్, రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్, పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్, ట్రాఫిక్ అదనపు కమిషనర్ సుధీర్ బాబు, డిసిపిలు కిరణ్ ఖరే, జోయల్, కార్పొరేటర్ నసీరుద్దీన్, ఏసీపీ శివమారుతి, బీఆర్‌ఎస్ కార్వాన్ ఇన్‌చార్జ్ టి. జీవన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సైబరాబాద్‌లో స్పెషల్ డ్రైవ్

8 రోజుల్లో మొత్తం 1050 కేసులు నమోదు



రాయదుర్గం: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈనెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు 15 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో కొనసాగిన డ్రైవ్‌లో 1050 కేసులు నమోదు చేశారు. సీపీ స్టీఫెన్ రవీంద్ర సూచనలపై ఈ డ్రైవ్ కొనసాగింది. ముఖ్యంగా అక్రమ సైరన్లు, మల్టీటోన్ హారన్లు, టింటెడ్ గ్లాస్ బ్లాక్ ఫిల్మ్ కట్టడి చేసేందుకు ఈ డ్రైవ్ నిర్వహించారు. టింటెడ్ గ్లాస్ బ్లాక్ ఫిల్మ్ ఉల్లంఘనలు నేర కార్యకలాపాలకు దారి తీస్తున్నాయన్నాయని సైబరాబాద్ జాయింట్ కమిషనర్ (ట్రాఫిక్) కె నారాయణ నాయక్ స్పష్టం చేశారు. స్పెషల్ డ్రైవ్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికార సైరన్‌లు వాడే అన్ని వాహనాలను అదుపులోకి తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. ఇతర సైరన్‌లను వినియోగించడం చట్టవిరుద్ధమని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. డీసీపీలు హర్షవర్ధన్, శ్రీనివాసరావు, సైబరాబాద్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై నివేదిక సిద్ధం చేయాలి

ఎమ్మెల్యేలు గాంధీ, వివేకానంద్



మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అభివృద్ధి పనులకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధికారులకు సూచించారు. సోమవారం మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిజాంపేట్ మేయర్ నీలారెడ్డి, ఆయా విభాగాల ఉన్నతాధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్ సమస్యలు అధిగమించేందుకు నూతనంగా చేపట్టనున్న ఫ్లైఓవర్, రోడ్ల అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. జేఎన్‌టీయూ నుండి ప్రగతి నగర్ వెళ్లే రోడ్డులో నిత్యం వాహనదారులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ఫ్లైఓవర్ ఏర్పాటుకు జూన్ 1వ తేదీ వరకు ప్రణాళిక సిద్ధం చేసి తమ దృష్టికి తీసుకువస్తే ఆ నివేదికను మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా మియాపూర్‌లోని సర్వే నంబర్ 170 వద్ద లింకు రోడ్డు నుండి నిజాంపేట్ కమాన్ వరకు ప్రధాన రోడ్డు విస్తరణ పనులను, నిజాంపేట్ నుండి ప్రగతినగర్ వరకు రోడ్డు అభివృద్ధి పనులకు అవసరమయ్యే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మియాపూర్ నుండి గండి మైసమ్మ వరకు రూ.130 కోట్లతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.నిజాంపేట్ కమిషనర్ రామకృష్ణారావు, ఎస్‌ఆర్‌డీపీ ఎస్‌ఈ వెంకటరమణ, హెచ్‌ఆర్‌డీసీఎల్‌ఈఈ సర్దార్ సింగ్, కూకట్‌పల్లి టౌన్ ప్లానింగ్ సీపీ ఉమాదేవి, డీసీపీ రఘునందన్, ఏసీపీ రాణి, కూకట్‌పల్లి జోన్ ఎస్‌ఈ చెన్నారెడ్డి, ఈఈ గోవర్ధన్, ఎస్‌ఈ ఆనంద్, నారాయణ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

నాలా విస్తరణ పనులు పరిశీలన

చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తీశ్రీనగర్ వద్ద రూ.90 లక్షల రూపాయల వ్యయంతో చేపడుతున్న నాలా విస్తరణ పనులను జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే గాంధీ పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఏఈ శివప్రసాద్, టీపీఎస్ మౌనిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ రఘు, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.